RNI No: APTEL /25/A2860

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 42 | పేజీలు : 4 | గురువారం 13 ఆగస్టు 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



### జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసు..
## జస్టిస్ యశ్వంత్ వర్మను దోషిగా తేల్చిన ప్యానెల్!

- నగదు కేసులో మాజీ జడ్జి యశ్వంత్ వర్మను దోషిగా తేల్చిన ప్యానెల్
- వర్మ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొన్న కమిటీ
- నగదును వర్మ స్వయంగా తొలగించారనడానికి ఆధారాలు లేవన్న కమిటీ
- కీలక ఆధారాలను సరిగ్గా భద్రపరచలేదని దర్యాప్తుపై ప్యానెల్ ఆగ్రహం
- నగదు కనిపించకుండా పోవడంపై స్పష్టత లేదని నివేదిక

### అమరావతి రైతులది త్యాగం మాత్రమే కాదు..
## భవిష్యత్ తరాలకు
# స్ఫూర్తి



- సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం సందర్భంగా చంద్రబాబు తీవ్ర భావోద్వేగం
- శూన్యం నుంచి గొప్ప రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని వ్యాఖ్య

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశతో పాటు, విజయవాడ-మంగళగిరి హైవేను అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన నూతన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. ఉండవల్లి వద్ద ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం, అనంతరం స్వయంగా కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జి నిర్మాణాలు, రహదారి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులు, స్థానికులను ఉద్దేశించి ఆయన అత్యంత భావోద్వేగంగా ప్రసంగించారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన అన్నదాతలు చేసింది- మిగతా3లో

## బంగ్లాదేశ్‌లో కరెంట్ కష్టాలు

- భారత్ సహకారం కోరిన పొరుగుదేశం
- బంగ్లాదేశ్‌లో తీవ్ర విద్యుత్ సంక్షోభం
- గ్రామీణ ప్రాంతాల్లో 10 గంటల వరకు కరెంట్ కోతలు
- రాత్రి 8 గంటలకే దుకాణాలు మూసివేయాలని ప్రభుత్వ ఆదేశం
- అదనపు డీజిల్ సరఫరా చేయాలని భారత్‌ను కోరిన బంగ్లాదేశ్



### కాంగ్రెస్ ఉన్నంతకాలం సెక్యులర్ వర్గాలకు
# మనుగడ

- "రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది
- వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు
- గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం
- లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది



**హైదరాబాద్**

కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. గత ప్రభుత్వం ఆర్ఎంపీ వైద్యుడిని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో సభ్యుడిని చేసింది. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో - మిగతా3లో



### ఏపీపీఎస్సీలో అక్రమాలు
## సిట్ నివేదికతో బట్టబయలయ్యాయి

- జగన్ సమాధానం చెప్పాలి
- ఏపీపీఎస్సీ వ్యవహారంలో సిట్ నివేదికను బయటపెట్టిన మంత్రి డోలా
- 97.55 శాతం ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయని నివేదికలో వెల్లడి
- ప్రైవేట్ రిసార్ట్‌లో, అనర్హులతో వాల్యుయేషన్ జరిపినట్లు గుర్తింపు
- యువతను మోసం చేసిన జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్
- తమ ప్రభుత్వం పారదర్శకంగా 16 వేల డీఎస్సీ పోస్టులు భర్తీ చేసిందని స్పష్టీకరణ

## భారత్‌తో సరిహద్దు వివాదం
### ఒరిజినల్ పత్రాలపై చేతులెత్తేసిన నేపాల్

- సుగౌలీ ఒప్పందం అసలు పత్రాలు తమ వద్ద లేవని తెలిపిన నేపాల్
- భారత్‌తో సరిహద్దు వివాదానికి ఈ ఒప్పందమే కీలకం
- పార్లమెంటులో విషయాన్ని అంగీకరించిన నేపాల్ విదేశాంగ మంత్రి
- ప్రభుత్వ విభాగాల్లో వెతికినా అసలు పత్రాలు దొరకలేదని వెల్లడి





## నేరస్తులను, అక్రమార్కులను పరామర్శించేందుకే జగన్ యాత్రలు చేపడుతున్నారు

- ప్రజాసమస్యలపై జగన్‌కు చిత్తశుద్ధి లేదని సత్యకుమార్ విమర్శ
- చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రావాలని సవాల్
- వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా జగన్ అడ్డుకుంటున్నారని మండిపాటు

## 'సర్' పేరుతో కాల్స్, ఎస్సెమ్మెస్‌లు
### ఓటర్లకు తెలంగాణ సీఈవో హెచ్చరిక




- ఓటరు జాబితా సవరణ పేరుతో జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్న సీఈఓ
- ఫారం తిరస్కరణకు గురైందంటూ రూ.5 కట్టాలని మోసపూరిత సందేశాలు
- బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు చెప్పొద్దని అధికారుల సూచన
- ఎన్నికల సంఘం ఇలాంటి కాల్స్ చేయదని, డబ్బులు అడగదని స్పష్టీకరణ
- అనుమానిత సందేశాలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి

### ఉచిత కుట్టుమిషన్లు..
## 15 నుంచి దరఖాస్తులు

- బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తాం
- ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట
- తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్**

బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. - మిగతా3లో



## రాజ్యసభలో రగడ

- ఖర్గే సభ జరిగిన చోట శుద్ధీకరణ హోమం
- రాజ్యసభలో ఖర్గే తీవ్ర అభ్యంతరం
- ఘటన దురదృష్టకరమన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా
- బీజేపీకి ఆ కార్యక్రమంతో సంబంధం లేదన్న నడ్డా
- ఘటనపై విచారణ జరుపుతామని హామీ

గురువారం 13 ఆగస్టు 2026

# సీమ వార్త సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

## క్రీడలకు మైలురాయి....

# ఆర్డిటి స్టేడియం.

ఆర్‌డీటీ క్రీడా మైదానం గ్రామీణ క్రీడాకారుల పురోగతికి మైలురాయి

బాలికలతో కలిసి కబడ్డీ ఆడిన జిల్లా కలెక్టర్,ఎమ్మెల్యే

జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్



**మడకశిర,ఆగస్టు,13: సీమ వార్త సాయంత్రం.**

మడకశిర మండలం, ఆర్. అనంతపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌డీటీ స్పోర్ట్స్ స్టేడియంను గురువారం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మడకశిర ఎమ్మెల్యే ఎం. రాజు, ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి మరియు ఆర్‌డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మంచో ఫెరార్ లతో కలిసి అధికారికంగా ప్రారంభించారు.మడకశిర మండలం, ఆర్. అనంతపురం గ్రామంలో నూతనంగా ప్రారంభించిన ఆర్‌డీటీ స్పోర్ట్స్ స్టేడియం ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. మైదాన ప్రారంభోత్సవం అనంతరం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ విద్యార్థినులు, గ్రామీణ బాలికలతో కలిసి ఉత్సాహంగా కబడ్డీ ఆడారు.కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌తో పాటు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మడకశిర ఎమ్మెల్యే ఎం. రాజు, ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి మరియు ఆర్‌డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మంచో ఫెరార్ దిగి క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు. స్వయంగా కలెక్టర్, ఎమ్మెల్యే బాలికలతో కలిసి కబడ్డీ ఆడటంతో మైదానంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి.జిల్లా కలెక్టర్ - మిగతా3లో

## ప్రజలు స్ఫూర్తిని పెంచేందుకు...

# హర్ ఘర్ తిరంగా..!!







....పుట్టపర్తిలో ఘనంగా "హర్ ఘర్ తిరంగా" ర్యాలీలి

....దేశభక్తి నినాదాలతో మార్మోగిన పుట్టపర్తి వీధులులి

.....పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**పుట్టపర్తి,ఆగస్టు,13 సీమ వార్త సాయంత్రం.**

దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సార్వభౌమత్వం పట్ల ప్రజల్లో స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో గురువారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. పుట్టపర్తిలోని సత్యమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ర్యాలీలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్,ఆర్డీఓ సువర్ణ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఫైరోజా బేగం , ఐసిడిఎస్ పిడి ప్రమీల,డిఆర్‌డిఎ పిడి నరసయ్య తో పాటు వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ర్యాలీ ప్రారంభం నుంచి ముగింపు వరకు దేశభక్తి, జాతీయ భావం ఉట్టిపడేలా సాగింది. చిన్నారులు, విద్యార్థులు చేతుల్లో జాతీయ పతాకాలను పట్టుకుని ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ మధ్యలో విద్యార్థులు, చిన్నారులు "వందే మాతరం", "భారత్ మాతాకీ జై" - మిగతా3లో

# రాయలసీమ బలిజ లకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి



**ధర్మవరం ఆగస్టు 13 సీమ వార్త సాయంత్రం.**

## ధర్మవరం బలిజ సంఘం నేతలతో ప్రత్యేక సమావేశం.

## రాష్ట్ర కాపునాడు అధ్యక్షులు నారాయణస్వామి రాయల్.



ధర్మవరం శ్రీకృష్ణ దేవరాయల బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీరాముల ఆద్వర్యంలో జరిగిన బలిజ సంఘం సమావేశం లో ముఖ్య అతిదులుగా రాష్ట్ర కాపునాడు అధ్యక్షులు నారాయణస్వామి రాయల్ రాష్ట్ర కాపునాడు ప్రధాన కార్యదర్శి సెగినేని పోతులూరయ్య పాల్గొన్నారు.ఈ సమావేశం లో నారాయణ స్వామి రాయల్ మాట్లాడుతూ రాయలసీమ లో ఈ సారి వచ్చే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో బలిజ లకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఏ పార్టీ అయ్యిన బలిజ లకు అసెంబ్లీ కానీ పార్లమెంట్ స్థానాలు కేటాయిస్తే పార్టీ లకు అతీతంగా బలిజ సోదరులు ఏకమై బీసీ నాయకులను బిసి లకు చెందిన అన్ని కులాల కలుపుకొని గెలిపించి కుంటమాని వివిధ రాజకీయ పార్టీలకు సూచించారు .అలాగే బీసీ లకు కేటాయించిన స్థానాలకు కూడా బలిజ లము అందరం కలిసి బీసీ లను గెలిపించు కుంటామని తెలియచేశారు .అనంతరం రాష్ట్ర కాపునాడు ప్రధాన కార్యదర్శి సెగినేని పోతులూరయ్య మాట్లాడుతూ రాయలసీమ బలిజ లు అందరం ఐక్యం కావలసిన సమయం వచ్చినది రాజకీయ ప్రాధాన్యత సాధించుకోవాలని రాయలసీమ బలిజ ల ఉనికి కోసం ఆరాటపడే డైనమిక్ లీడర్ ను రాజకీయ వేదిక పైన కూర్చోపెట్టాలని వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు.ధర్మవరం బలిజ సంఘం ఆయన దృష్టికి తీసుకొచ్చిన బలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణం మరియు ప్రతిభా వంతులు అయిన విద్యార్థుల కి స్కాలర్షిప్ అందించాలని కోరగా ఇటువంటి కార్యక్రమాలు కు సంపూర్ణ మద్దతు ఉంటుంది త్వరలో ఒక ట్రస్ట్ ద్వారా ఈ విషయాలు ముందుకు తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నామని వారికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం బలిజ సంఘం అధ్యక్షుడు కదిరింటి శ్రీరాములు బలిజ సంఘం నాయకులు ఎస్ చలపతి ఎస్ వెంగముని బి జి రామాంజనేయులు గుండ్లపల్లి ధనుంజయ్ పాలగిరి నాగభూషణ్ చిన్నకోట్ల భీమయ్య గదాల శ్రీరాములు ముని వెంకటాచలం చింతల భాస్కర్ స్టూడియో రాజు తుమ్మల సుబ్రమణ్యం పెద్ద మణికంఠ బొడ్డు చంద్రమోహన్ పూల నరేష్ రాప్తాడు రవి రాముడు రాజ్ కుమార్ సుధాకర్ లక్ష్మయ్య ప్రకాష్ వెంకటేష్ మంజునాథ్ సురేంద్ర రామ్మోహన్ వెంకట రమణ శ్యామ్ కుమార్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలోని...

# సుందర ప్రదేశాల్లో సునీత

.....స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

....మంత్రి నారా లోకేష్‌తో వర్సిటీ విశేషాలు పంచుకున్న సునీత

....అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఒక అద్భుతమన్న సునీత





**అనంతపురం డెస్క్ ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం.**

అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఒక అద్భుతం అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆమె బుధవారం స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీని సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే చదివిన నేపథ్యంలో యూనివర్శిటీ విశేషాలను ఎమ్మెల్యే సునీత పంచుకున్నారు. మీరు ఎంబిఏ చదివిన, ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలలో ఒకటిగా ఉన్న అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని సందర్శించానని.ఈ ఫోటోలను తమకి పంపుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే 3వ స్థానంలో ఉన్న ఈ యూనివర్సిటీలో మీరు చదవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా స్టాన్‌ఫోర్డ్ ఎంబిఏ ప్రోగ్రామ్, ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అగ్రశ్రేణిలో కొనసాగుతోందని తెలుసుకున్నానన్నారు. ఇక్కడ సీటు సాధించడం అత్యంత కఠినమైన విషయమని.. అలాంటిది మీరు ఇక్కడ చదవడం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే ప్రపంచాన్ని శాసిస్తున్న అనేక దిగ్గజ కంపెనీల వ్యవస్థాపకులు ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకుల్లో ఉన్నారని, దాదాపు 21 మందికి పైగా నోబెల్ బహుమతి గ్రహీతలు ఇక్కడ చదివిన వారు ఉన్నారని తెలుసుకున్నట్లు చెప్పారు. ఇంత గొప్ప యూనివర్సిటీలో చదువుకున్నారు కాబట్టే.. మీరు రాష్ట్రానికి ఇలా అత్యుత్తమ సేవలు అందించగలు గుతున్నారన్నారు. ఈరోజు రాష్ట్రానికి లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకురావడం, విద్యాశాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకొస్తున్నా రంటే ఇక్కడ మీరు పొందిన విజ్ఞానం అని అర్థమవు తోందన్నారు. ఇలాంటి యూనివర్సిటీలో మీరు చదివినందుకు, అలాగే మీరు మన రాష్ట్ర మంత్రి అయినందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. అయితే రాయలసీమ ప్రాంతంలో ఎస్కేయూనివర్శిటీ, జేఎన్టీయూలు తప్ప పెద్దగా చెప్పుకోదగ్గ యూనివర్శిటీలు లేవని.. మీరు ప్రత్యేకంగా చొరవ చూపి స్టాన్ ఫోర్డ్ లాంటి ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థల్ని నెలకొల్పాలని మంత్రి నారా లోకేష్ కు ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే....

# ప్రజా దర్బార్

....పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత ప్రజా దర్బార్



**పెనుగొండ ఆగస్టు 13 సీమ వార్త సాయంత్రం.**



పెనుకొండ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నుంచి వచ్చిన నాయకులు, ప్రజలు, కార్యకర్తలు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతులు సమర్పించారు.ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, స్థానిక సమస్యలను మంత్రి సవితమ్మ విని, ప్రతి సమస్యపై సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు.ప్రజల నుంచి వచ్చిన వినతులపై సంబంధిత అధికారులతో మాట్లాడి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అర్హత మేరకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు నేరుగా అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకోవడం, కూటమి ప్రభుత్వం లక్షమని మంత్రి సవిత తెలిపారు..

సీమ వార్త సాయంకాలం

గురువారం
13 ఆగస్టు 2026

## భారత్‌తో సరిహద్దు వివాదం..
## ఒరిజినల్ పత్రాలపై చేతులెత్తేసిన నేపాల్

భారత్‌తో దశాబ్దాలుగా కొనసాగుతున్న సరిహద్దు వివాదం నేపథ్యంలో నేపాల్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది. ఇరు దేశాల మధ్య సరిహద్దులను ఖరారు చేసిన 1816 నాటి చారిత్రక సుగౌలీ ఒప్పందానికి సంబంధించిన అసలు పత్రాలు తమ వద్ద ఉన్నాయో లేదో స్పష్టంగా తెలియదని నేపాల్ ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించింది. లిపులేఖ్, కాలాపానీ, లింపియాధురా ప్రాంతాలపై భారత్‌తో వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. నేపాల్ విదేశాంగ మంత్రి షిశిర్ ఖనాల్ ఈ విషయాన్ని ప్రతినిధుల సభలో స్వయంగా వెల్లడించారు. కొన్ని ఒప్పందాలకు సంబంధించిన రికార్డులు నేషనల్ ఆర్కైవ్స్‌లో ఉన్నప్పటికీ, అవి అసలైన ఒప్పంద పత్రాలా కాదా అనే విషయంపై స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. సుగౌలీ ఒప్పందంతో పాటు, 1950 నాటి శాంతి, స్నేహ ఒప్పంద పత్రాలు కూడా తమ వద్ద ఉన్నట్టు కొన్ని రికార్డుల ద్వారా తెలుస్తోందని.. అయితే, పార్లమెంటరీ కమిటీ ఆర్కైవ్స్, మ్యూజియంలు, వివిధ మంత్రిత్వ శాఖలలో శోధించినప్పటికీ, ఈ రెండు కీలక ఒప్పందాల అసలు ప్రతులు లభ్యం కాలేదని వివరించారు. 1814-16 మధ్య జరిగిన ఆంగ్లో-నేపాల్ యుద్ధం అనంతరం సుగౌలీ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, కాళీ (మహాకాళి) నదిని నేపాల్ పశ్చిమ సరిహద్దుగా నిర్ణయించారు. అయితే, ఆ నది లింపియాధురా వద్ద ఉద్భవిస్తుందని, కాబట్టి కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతాలు తమవేనని నేపాల్ వాదిస్తోంది. దీనికి భిన్నంగా, లిపులేఖ్ సమీపంలోని నీటి బుగ్గల నుంచి నది ప్రారంభమవుతుందని, చారిత్రక పరిపాలనా రికార్డుల ప్రకారం ఈ ప్రాంతాలు ఉత్తరాఖండ్‌లో భాగమని భారత్ స్పష్టం చేస్తోంది. 2020లో ఈ మూడు ప్రాంతాలను కలుపుతూ నేపాల్ తన నూతన రాజకీయ పటాన్ని విడుదల చేయగా, భారత్ దానిని తీవ్రంగా తోసిపుచ్చింది. ఇటీవల లిపులేఖ్ మీదుగా వాణిజ్యాన్ని పునఃప్రారంభించేందుకు భారత్, చైనాలు అంగీకరించడంపై నేపాల్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో అసలు ఒప్పంద పత్రాలపై స్పష్టత లేకపోవడం, అంతర్జాతీయ వేదికలపై తమ వాదనలను బలంగా వినిపించే విషయంలో నేపాల్‌ను బలహీనపరిచే అంశంగా మారింది.

## 'సర్' పేరుతో కాల్స్, ఎస్సెమ్మెస్‌లు..
## ఓటర్లకు తెలంగాణ సీఈవో హెచ్చరిక

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం హెచ్చరించారు. నగదుతో పాటు సున్నితమైన బ్యాంకింగ్ వివరాలను దొంగిలించేందుకు కొందరు మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు పంపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాల గురించి సీఈఓ కార్యాలయం సవివరంగా వెల్లడించింది. "ఓటరు గుర్తింపు కార్డులోని వివరాలు, 'సర్' ఫారంలోని వివరాలతో సరిపోలడం లేదని, అందుకే మీ దరఖాస్తు తిరస్కరణకు గురైందంటూ ఓటర్లకు సందేశాలు పంపుతున్నారు. సవరణ కోసం ఒక నంబర్‌కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ లింక్‌పై క్లిక్ చేయాలని వారు సూచిస్తున్నారు. ఆ తర్వాత, నామమాత్రంగా రూ.5 చెల్లించాలని కోరుతూ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/డెబిట్ కార్డుల లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, సీవీవీ నంబర్లు, ఏటీఎం పిన్‌ల వంటి అత్యంత రహస్య సమాచారాన్ని కాజేసే ప్రయత్నం చేస్తున్నారు" అని సీఈవో వివరించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ, తెలంగాణ సీఈఓ కార్యాలయం కానీ ఓటర్లకు ఇటువంటి సందేశాలు పంపదని, ఫోన్ కాల్స్ చేయదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటువంటి మోసపూరిత సమాచారాన్ని నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత, ఆర్థిక వివరాలను పంచుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా ఉచితమని, దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇటువంటి మోసాలు జరుగుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే అధికారిక ఈసీఐ ప్లాట్‌ఫారమ్‌లను సంప్రదించాలని లేదా నేరుగా తమ బూత్ స్థాయి అధికారులను కలవాలని అధికారులు సూచించారు.

## బంగ్లాదేశ్‌లో కరెంట్ కష్టాలు..

పొరుగు దేశమైన బంగ్లాదేశ్ ప్రస్తుతం తీవ్ర విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా రాజధాని ఢాకా మినహా ఇతర గ్రామీణ ప్రాంతాల్లో రోజుకు 9 నుంచి 10 గంటల పాటు విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. విద్యుత్ పొదుపులో భాగంగా రాత్రి ఎనిమిది గంటలకే షాపింగ్ మాల్స్, దుకాణాలు, మార్కెట్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంధన కొరతను అధిగమించేందుకు అదనపు డీజిల్ సరఫరా చేయాలని భారత్‌ను అభ్యర్థించింది. దేశంలో విద్యుత్ డిమాండ్ 18,000 మెగావాట్లకు చేరగా, సరఫరా మాత్రం 13,000 మెగావాట్లకే పరిమితమైంది. సహజవాయువు కొరత కారణంగా సుమారు 1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. గత నెలలో ఒక టెర్మినల్‌లో సంభవించిన అగ్నిప్రమాదం వల్ల ఎల్ఎన్‌జీ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడం ఈ సంక్షోభానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రెండు ఎల్ఎన్‌జీ నౌకలు కూడా సరుకును అన్‌లోడ్ చేయలేకపోయాయి. మైమెన్‌సింగ్, బరిశాల్, రంగ్‌పూర్, సిల్హెట్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ఆగ్రహానికి గురైన స్థానికులు విద్యుత్ కార్యాలయాలపై దాడులకు పాల్పడిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ సంక్షోభం పరిశ్రమలు, రైతులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రొయ్యల సాగులో ఏరేటర్లు పనిచేయకపోవడంతో రైతులు భారీగా నష్టపోతుండగా, వస్త్ర పరిశ్రమ ఉత్పత్తికి కూడా తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఇండియా-బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్ ద్వారా అదనపు డీజిల్ పంపాలని బంగ్లాదేశ్ ఇంధన శాఖ మంత్రి ఇక్బాల్ హసన్ మహమూద్ భారత హైకమిషనర్‌ను కోరారు. ప్రస్తుతం ఉన్న ఒప్పందం ప్రకారం భారత్ ఏటా 1,80,000 మెట్రిక్ టన్నుల డీజిల్‌ను బంగ్లాదేశ్‌కు సరఫరా చేస్తోంది. అయితే, దిగుమతి చేసుకునే ఇంధనంపైనే అధికంగా ఆధారపడటం వల్ల తక్షణమే ఉపశమనం లభించే అవకాశాలు పరిమితంగానే ఉన్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## నేరస్తులను, అక్రమార్కులను పరామర్శించేందుకే
## జగన్ యాత్రలు చేపడుతున్నారు:

సత్యకుమార్



వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజయనగరం జిల్లా బొబ్బిలి పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ... సమాజంలో నేరాలు, అక్రమాలకు పాల్పడే వారిని పరామర్శించడానికే జగన్ ప్రత్యేక యాత్రలు చేపడుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై వైసీపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, శాసనసభకు దూరంగా ఉండటం మాని వెంటనే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. జగన్ తాను అసెంబ్లీకి రాకపోవడమే కాకుండా, తన పార్టీ ఎమ్మెల్యేలను కూడా చట్టసభకు పంపకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య రంగంపై మాట్లాడిన మంత్రి సత్యకుమార్... ప్రజలకు మెరుగైన ఉచిత, త్వరితగతిన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పీపీపీ విధానంలో అధునాతన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

## నిరసనలు, నినాదాలతో సభ ప్రతిష్ఠను
## దెబ్బతీయొద్దు'

నిరసనలు చేపట్టడం, నినాదాలు చేయడం ద్వారా లోక్‌సభ ప్రతిష్ఠను దెబ్బతీయడం సమంజసం కాదని లోక్?సభ స్పీకర్ ఓం బిర్లా హితవు పలికారు. ప్రజల సమస్యలపై చర్చించేందుకు పార్లమెంట్ వేదికగా ఉందని, సభ్యులు తమ అభిప్రాయాలను సభలో వ్యక్తం చేయాలని సూచించారు. ప్రతిపక్షం, అధికారపక్షం ఆలోచనలు, విధానాలు వేర్వేరుగా ఉండొచ్చని, కానీ దేశ ప్రజలు మాత్రం పార్లమెంట్ సజావుగా పనిచేయాలని కోరుకుంటున్నారని అన్నారు. బుధవారం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే విపక్ష సభ్యులు తమ డిమాండ్లపై నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో స్పీకర్ ఓం బిర్లా వారిని ఉద్దేశించి మాట్లాడారు. సభను పనిచేయనివ్వాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం సమావేశాలు ప్రారంభమైన తర్వాత స్పీకర్ విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు తమ ఆందోళనను కొనసాగించారు. నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. దీంతో పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో స్పీకర్ లోక్‌సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. దీంతో బుధవారం ప్రశ్నోత్తరాల సమయం మూడు నిమిషాలకంటే తక్కువ వ్యవధికే పరిమితమైంది. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ప్రభుత్వాన్ని వివిధ అంశాలపై ప్రశ్నించి సమాధానాలు పొందాల్సి ఉండగా, నిరసనల కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు రోజూ ఏదొక అంశంపై ప్రతిపక్షం, ప్రభుత్వానికి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కరోజు కూడా ప్రశ్నోత్తరాల సమయం పూర్తిస్థాయిలో కొనసాగలేదు. ఇలా జరగడం ఇది 18వ రోజు.

## పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

నీట్- యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని దిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకుంది. 13 మంది నిందితులపై దర్యాప్తు సంస్థ సమర్పించిన ఛార్జ్‌షీట్‌ను ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా పరిశీలించారు. పేపర్ లీక్‌లపై విచారణకు ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఇటీవలే సీబీఐ తుది ఛార్జ్ షీట్‌ను వేసింది. 13 మంది నిందితులపై 20వేల పేజీలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. పబ్లిక్ ఎగ్జామినేషన్ చట్టం, 2024 కింద నిందితులపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేసింది. అభియోగాలపై గురువారం నుంచి వాదనలు వింటామని న్యాయస్థానం తెలిపింది. 360 మంది సాక్షులు, 422 డాక్యుమెంట్లు, 43 భౌతిక సాక్ష్యాలను అభియోగపత్రంలో పొందుపర్చినట్లు సీబీఐ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మీడియా ప్రచురిస్తున్న పేర్లలో కొందరు సాక్షులు మైనర్లు ఉండొచ్చని ఛార్జిషీటులోని కొన్ని భాగాలను పత్రికల్లో నిరంతరం ప్రచురిస్తున్నారని కోర్టుకు సీబీఐ తెలియజేసింది. అయితే, ఈ కేసులో సాక్షుల పేర్లను మీడియా ప్రచురించడంపై న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టులో ఇంకా చెప్పనివి, ప్రస్తుతం ఛార్జిషీటులో భాగంగా ఉన్నవి మీడియాలో బహిర్గతం కావడం ఆశ్చర్యకరమని కోర్టు పేర్కొంది. బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి పనులు చేయకుండా ఉండాలని సూచించింది.

### పేపర్ లీక్‌ను అరికట్టడానికే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

ఇదిలా ఉండగా, పేపర్ లీక్ వ్యవహారంపై ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. పరీక్ష పత్రాల లీకేజీని అరికట్టడానికి, అలాగే లీకేజీ బాధ్యులకు త్వరితగతిన శిక్ష పడేలా చూసేందుకు ఈ ఫాస్ట్?ట్రాక్? కోర్టులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కేసుల విచారణలో జాప్యం జరగకుండా, రోజువారీ ప్రాతిపదికన విచారణ జరిపేలా చర్యలు తీసుకోనున్నారు. అలాగే, 2 నుంచి 3 నెలల లోపే కేసుకు సంబంధించిన తీర్పులు ఇచ్చేలా ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరీక్షల్లో అవకతవకలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన 'యాంటీ పేపర్ లీక్ బిల్లు'కు కూడా ఇటీవల లోక్‌సభ ఆమోదం లభించింది. ఈ చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్త సవరణలు తీసుకొచ్చింది. దీని ప్రకారం, ఈ కేసులో దోషులుగా నిర్ధరణ అయితే, గరిష్ఠంగా 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే, రూ.10కోట్ల వరకు భారీ జరిమానా విధిస్తారు.

### ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

ఇక, పేపర్ లీక్‌లను అరికట్టడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లాగే, ప్రత్యేక టాస్క్? ఫోర్స్?ను ఏర్పాటు చేస్తున్నట్లు కూడా కేంద్ర ప్రభుత్వం ఇదివరకే తెలిపింది. పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు మోదీ ప్రకటించారు. ఇందుకోసం అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువత భవిష్యత్తుకు హాని చేయాలని చూసేవారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, యువత సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆయన పేర్కొన్నారు. అయితే, ప్రత్యేక టాస్క్?ఫోర్స్? కోసం ఏర్పాటు చేసిన కమిటీ, ప్రధానంగా పరీక్షల సంస్కరణలపై దృష్టి సారిస్తుంది. కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఈ కమిటీలో నందన్ నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు అమృత్ లాల్ మీనా సభ్యులుగా ఉన్నారు.

## త్వరలోనే జంతర్
## మంతర్ సీజన్- 2 ప్రారంభం

### సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే

విద్యార్థుల నిరసన తరహాలోనే మరో నిరసన కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఆయన 'జంతర్ మంతర్ సీజన్- 2'గా అభివర్ణించారు. దిల్లీలో తమ వాలంటీర్ల సమావేశం కోసం వేదికను వెతకడంలో సీజేపీ ఇబ్బందులు ఎదుర్కొందని తెలిపారు. చాలా మంది హాల్ యజమానులు పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెప్పి తమకు వేదికను ఇచ్చేందుకు నిరాకరించారని ఆరోపించారు. ఈ బెదిరింపుల వెనుక బీజేపీ హస్తం ఉందని విమర్శించారు. ఇటువంటి చర్యలు సీజేపీని ఏమాత్రం భయపెట్టలేవని స్పష్టం చేశారు. దిల్లీలో జరిగిన బహిరంగ సమావేశంలో ఈ మేరకు అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. "'జంతర్ మంతర్ సీజన్- 2' ఎప్పుడు మొదలవుతుందని చాలా మంది ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుతున్నారు. వారికి నేను చెప్పేది ఒక్కటే- 'జంతర్ మంతర్ సీజన్- 2' చాలా త్వరలోనే ప్రారంభం కాబోతోంది. ఈ రోజు దిల్లీలో మా వాలంటీర్ల సమావేశాన్ని నిర్వహించాలని అనుకున్నాం. దాని కోసం హాల్ వెతికినా ఎవరూ అద్దెకు ఇవ్వలేదు. చాలా మంది హాల్ యజమానులు పైస్థాయి నుంచి ఒత్తిడి ఉందని చెబుతున్నారు. చివరికి ఒక హాల్ దొరికింది. అయితే ఆ యజమానికి ఈ రోజు ఉదయం బెదిరింపులు వచ్చాయి. సీజేపీ సమావేశాన్ని ఇక్కడ జరగనిస్తే వారిని (హాల్ యజమానులను) తలకిందులుగా వేలాడదీస్తామని బెదిరించారు. ఈ బెదిరింపుల వెనుక బీజేపీ ఉంది. ఇదంతా బీజేపీయే చేస్తోంది. దేశంలోని యువతను చూసి కమలం పార్టీ భయపడుతోంది. ఆ పార్టీ నేతల మాటలు, చేతలు ఆ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఇలాంటి చర్యలతో మమ్మల్ని భయపెట్టవచ్చని వారు అనుకుంటే అది పొరపాటే. ఇటువంటి చర్యలకు మేం అస్సలు భయపడం. "

### బీజేపీపై ఫైర్

కమలం పార్టీపై దిల్లీ వేదికగా సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే మరోసారి ఘాటు విమర్శలు చేశారు. తాము పాఠశాలల బాగు గురించి మాట్లాడుతున్నందున గందరగోళం సృష్టించడానికి బయటి వ్యక్తులను ఇక్కడికి పంపారని ఆరోపించారు. బీజేపీకి విద్య విషయంలోనే సమస్య ఉందని మండిపడ్డారు. అసలు సీజేపీ సమావేశం వద్ద గందరగోళం సృష్టించడానికి వచ్చిన వ్యక్తి ఎవరో తమకు తెలియదన్నారు.

## ప్రజలు స్ఫూర్తిని పెంచేందుకు...
## హర్ ఘర్ తిరంగా..!!

-మొదటిపేజీ తరువాయి

వంటి దేశభక్తి నినాదాలతో పుట్టపర్తి ప్రధాన వీధులను మార్మోగించారు. వారి ఉత్సాహం, దేశభక్తి ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరిలోనూ జాతీయ స్ఫూర్తిని నింపింది.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయడంతో పాటు, జాతీయ జెండా పట్ల గౌరవం, జాతీయ ఐక్యత, దేశ సమగ్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు.ర్యాలీ ముగిసిన అనంతరం పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, చిన్నారులు మరియు ఇతరులు కలిసి "హర్ ఘర్ తిరంగా" ప్రతిజ్ఞను స్వీకరించారు. జాతీయ పతాక గౌరవాన్ని కాపాడుతూ, దేశ ఐక్యత మరియు సమగ్రతను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమం ద్వారా "ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం -- ప్రతి హృదయంలో దేశభక్తి" అనే సందేశం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. అధికారులు, విద్యార్థులు, చిన్నారులు సమన్వయంతో నిర్వహించిన ఈ ర్యాలీ పుట్టపర్తిలో దేశభక్తి, జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచింది.

## అమరావతి రైతులది త్యాగం మాత్రమే కాదు..
## భవిష్యత్ తరాలకు స్ఫూర్తి

-మొదటిపేజీ తరువాయి

కేవలం భూత్యాగం మాత్రమే కాదని, రాబోయే తరాలకు, ప్రపంచానికే ఆలోచింపజేసే ఒక గొప్ప స్ఫూర్తినిచ్చారని సీఎం చంద్రబాబు కొనియాడారు. రాజధాని నిర్మాణంలో రైతులను నేరుగా భాగస్వాములను చేయాలనే మహోన్నత ఆలోచనతోనే తాము ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చామని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఉంచిన నమ్మకంతో నోటిఫికేషన్ ఇచ్చిన కేవలం 58 రోజుల్లోనే 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ఉదారత చూడలేమని చెబుతూ అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను స్మరించుకుంటూ, నాడు మనకు రాజధాని ఎక్కడ నిర్మించాలో, ఎటు వెళ్లాలో తెలియని గందరగోళం నెలకొందని తెలిపారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికలు, మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేశామని చెప్పారు. నాడు ఏమీ లేని శూన్యం నుంచి నేడు ప్రపంచం గర్వించే రీతిలో స్వయంగా రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని ప్రస్తావిస్తూ... నాడు ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మిస్తుంటే చాలామంది హేళనగా మాట్లాడి ఎగతాళి చేశారని సీఎం గుర్తుచేశారు. కానీ నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందంటే ఒక నాయకుడిగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. నాడు చేసిన అభివృద్ధి వల్ల అక్కడ 42 శాతం మంది ప్రజలు బాగుపడ్డారని, మిగిలిన 58 శాతం ఉన్న మన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా ఒక సమర్థవంతమైన, ప్రపంచస్థాయి రాజధాని కావాలనే దృఢ సంకల్పంతోనే అమరావతికి శ్రీకారం చుట్టానని స్పష్టం చేశారు. సైబరాబాద్ నిర్మాణం కోసం తాను అమెరికా వెళ్తే, అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరం కావాలని తొలిసారి సింగపూర్ వెళ్లానని చెప్పారు. ఈ నగరంలో కేబుళ్లు ఏవీ పైన కనిపించవని, పూర్తి పర్యావరణహితంగా ప్రపంచంలోనే నంబర్ వన్ గ్రీన్ సిటీగా అమరావతి నిలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అమరావతిని కేవలం 'గ్రాఫిక్స్' అని విమర్శించిన వారు ఇప్పుడు ప్రత్యక్షంగా వచ్చి చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి ఏంటో కళ్లకు కట్టినట్లు తెలుస్తుందని సూచించారు. ఈ మహోన్నత కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సీఆర్‌డీఏ అధికారులు, వేలాది మంది అమరావతి రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఉన్నంతకాలం సెక్యులర్ వర్గాలకు మనుగడ

-మొదటిపేజీ తరువాయి

విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం"అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## ఉచిత కుట్టుమిషన్లు.. 15 నుంచి దరఖాస్తులు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

## ఏపీపీఎస్సీలో అక్రమాలు సిట్ నివేదికతో
## బట్టబయలయ్యాయి..

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, పాపాలు సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) నివేదిక ద్వారా బట్టబయలయ్యాయని, వీటికి మాజీ ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి డిమాండ్ చేశారు. గురువారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిట్ నివేదికలో వెలుగు చూసిన వాస్తవాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని అన్నారు. సిట్ నివేదిక ప్రకారం, వాల్యుయేషన్ ప్రక్రియలో పాల్గొన్న 158 మంది వాల్యుయేటర్లలో కేవలం 72 మందికి మాత్రమే అర్హత ఉందని, మిగిలిన వారంతా అనర్హులేనని మంత్రి స్పష్టం చేశారు. అధికారిక వ్యవస్థను కాదని, ప్రైవేట్ జీమెయిల్ ఖాతాలు, వ్యక్తిగత ఐడీలు, డ్రైవ్‌ల ద్వారా వాల్యుయేషన్ నిర్వహించడం దారుణమని అన్నారు. అంతేకాకుండా, అభ్యర్థుల ఆన్సర్ షీట్లను ఓ ప్రైవేట్ రిసార్ట్‌కు తరలించి, సీసీ కెమెరాలు గానీ, యూనివర్సిటీ నిపుణుల పర్యవేక్షణ గానీ లేకుండా 86 రోజుల పాటు అక్కడే ఉంచి మూల్యాంకనం జరిపారని ఆరోపించారు. ఎంపికైన 165 మంది అభ్యర్థుల్లో 160 మంది (96.97 శాతం) ఓఎంఆర్ షీట్లలో దిద్దుబాట్లు జరిగాయని, మొత్తం 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తే 97.55 శాతం షీట్లలో దిద్దుబాట్లు కనిపించాయని సిట్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో వైట్నర్ వాడకం, సంతకాలు సరిపోకపోవడం, ఒకే పేపర్‌లో రెండు రకాల ఇంక్ వాడటం, చీఫ్ ఎగ్జామినర్ సంతకాలలో తేడాలు వంటి అనేక అక్రమాలు తేలాయని వివరించారు. ఇవి కేవలం సాంకేతిక తప్పిదాలు కావని, మెరిట్ ఉన్న అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకున్న చెలగాటమని మంత్రి మండిపడ్డారు. ఈ అక్రమాలన్నింటికీ జగనే ప్రధాన బాధ్యుడని, యువతను, కోర్టులను తప్పుదారి పట్టించిన ఆయనకు రాజకీయాల్లో కొనసాగే నైతిక అర్హత లేదని డోలా అన్నారు. తమ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీలో భాగంగా, అత్యంత పారదర్శకంగా మెరిట్ ప్రాతిపదికన 16 వేల డీఎస్సీ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. వైసీపీ నేతలు 240కి పైగా కేసులు వేసినా, చట్టబద్ధంగా అన్నింటినీ అధిగమించి డీఎస్సీని పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న వారు, ముందుగా సిట్ నివేదికలో తేలిన తమ అక్రమాలపై సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. తెలుగుదేశం ప్రభుత్వం యువతకు న్యాయం చేస్తూ ముందుకు సాగుతుందని, గతంలో జరిగిన అక్రమాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీమ వార్త సాయంకాలం
గురువారం
13 ఆగస్టు 2026

## ప్రిన్సిపల్ విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే జె.సి. అష్మిత్ రెడ్డి

**యాడికి మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆట వస్తువుల అందజేత**



**యాడికి , ఆగస్టు 12 సీమ వార్త సాయంత్రం:** విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు శాసన సభ్యుడు జె.సి. అష్మిత్ రెడ్డి తక్షణమే స్పందించారు. యాడికి పట్టణంలోని మోడల్ స్కూల్ లో ఇటీవల నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్ కు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ పాఠశాలకు ఆట వస్తువులు అవసరమని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జె.సి. అష్మిత్ రెడ్డి ఆట వస్తువులు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు గురువారం యాడికి మోడల్ స్కూల్ కు అవసరమైన ఆట వస్తువులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఎమ్మెల్యే చర్యపై పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## కూటమి ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా తాడిపత్రికి రూ.5.44 కోట్లు

**వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు 51 మందికి రూ.39.45 లక్షలు అందజేత**

**చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జె.సి. అష్మిత్ రెడ్డి**



**తాడిపత్రి, ఆగస్టు 13 సీమా వార్త సాయంత్రం:** పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ద్వారా అండగా నిలుస్తోంది. తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో వైద్య చికిత్స కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న 51 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.39,45,448 విలువైన ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే జె.సి. అష్మిత్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. తెలుగుదేశం--జనసేన--బీజేపీ కూటమి ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చింది. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఎమ్మెల్యే జె.సి. అష్మిత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన 813 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.5,44,63,817 సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది" అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఆగని శ్యాండ్.....

**సమీపములో పోలీస్ చెక్ పోస్ట్ ఉన్న నిత్యం కాలర్ ఎగురేసి యదేచ్ఛగా పోతున్న శ్యాండ్....**

**ఒక చేతిలో సెల్ ఫోన్ మరొక చేతిలో స్టీరింగ్ రోడ్ ప్రమాధానికి దగ్గరలో డ్రైవింగ్.....**

**బయట అనుమతులు ఉన్నాయి అని చెప్పడం, అధికారులు వాహనాలు కనపడితే దాచుకోవడము....**





**రొద్దం ఆగస్టు 13(సీమవార్త సాయంకాలం)** మండల వ్యాప్తంగా అక్రమంగా రవాణా జరుగుతున్న శ్యాండ్ యదేచ్ఛగా తరిలిపోతున్నది.వాటికి అడ్డుకట్ట వేయడం లేక యదేచ్ఛగాపోతున్నాయి. ఈ సందర్భంగా మండలములోని చెరుకూరు గ్రామములో భార్డర్ చెక్ పోస్ట్ ను కుడా ఏర్పాటు చేయడము జరిగింది. అయితే కొంతమంది యదేచ్ఛగా అక్రమంగా ఇసుకను తరిలిస్తూనే ఉన్నారు. పోలీస్ చెకపోస్ట్ ఉన్నా కుడా నిర్లక్ష్యం తో నిల్కడ లేకుండా పోటా పోటీతో తరిలీస్తున్నారు. ఒక్కో గ్రామానికి ఒక్కో దొంగ రూట్లు రూటును తయారు చేసుకొని అక్రమంగా తరిలీస్తున్నారు. కానీ పోలీస్ చెక్ పోస్ట్ ఉండి ఇంత ధర్జాగా పొంతుంది అంటే దానికి కారణము ఏంటి అని పలు గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అందులో భాగంగా పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల, ఓడీసీ, సీకే. పల్లి, యన్. యస్. గేట్ ఇలా పలుచోట్లా ఇసుక డిమాండ్ పెరిగి ధరలు కూడా రెండింతలు, మూడింతలు పెరగడముతో ఇక్కడ మండల వ్యాప్తంగా రస్తాలు తప్పించి తరిలీస్తున్నారు అని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావముతో ఉన్న పళంగా వ్యవసాయ బోర్లు లో రోజు రోజు నిలబడి పోతున్నాయి ఆ బోర్లు కి పెన్నానదే మూల కారణము అలాంటి పెన్నా నదీని సర్వనాశనము చేస్తున్నారు అని మండల రైతులు మండిపడుతున్నారు. అక్రమంగా పోతున్న ట్రాక్టర్లు ను పోలీస్ సిబ్బంది పట్టుకుని మండల తాసీల్దార్ దగ్గర హాజరు పరిస్తే ఫైన్ వేయడం పంపడం తో ప్రతి ఒక్కరికి చులకనగా మారింది. కొన్ని గ్రామాల్లో అయితే రాత్రికి రాత్రే కర్ణాటక పావగడకు కల్లుకుంట, నల్లూరు, చిన్నమంతూరు, దందేపల్లి నుండి పోతున్నాయి అని సమాచారం. మరీ ఇప్పటికయినా సంబంధిత అధికారులు పూర్తీ గా అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం



**సోమందేపల్లి ఆగస్టు 13 సీమ వార్త సాయంకాలం** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వివిధ గ్రామాల నుండి విచ్చేసిన గర్భవతులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్, థైరాయిడ్ వైద్యాధికారి ఓంకార్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి పలు ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆరోగ్య పర్యవేక్షకుడు రవీంద్ర తన కుమార్తె కమలని పుట్టినరోజు ను పురస్కరించుకొని గర్భవతులకు పౌష్టికాహార భోజన వసతి ఏర్పాటు చేశారు.ఆరోగ్య సిబ్బంది, గర్భిణీ స్త్రీలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత నాయకుని హత్య ఖండించి నిరసన.



**పావగడ ఆగస్టు 13 సీమ వార్త సాయంత్రం.** రాయచూరు జిల్లా దేవదుర్గ జిల్లాలోని అత్తినాల గ్రామ దళిత నాయకుడు భూమానంద హత్యను ఖండించి, హత్యకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పావగడ దళిత సంఘం యూనియన్ సభ్యులు గురువారం తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్ ద్వారా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి పత్రం సమర్పించారు. భూమానంద హత్య కేసులో నిందితులను పట్టుకుని అరెస్టు చేసి కఠిన చట్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, మృతుడి కుటుంబానికి 50 లక్షల పరిహారం అందించాలని మరియు కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాన్ని అందించాలని వారి పిల్లలకు ఉన్నత చదువు పూర్తయ్యే వరకూ ప్రభుత్వమే వారి పూర్తి ఖర్చులను భరించాలి, అలాగే ఈ హత్య కేసును సి.ఓ.డి.కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాదర మహాసభ తాలూకా అధ్యక్షుడు నరసింహప్ప, తాలూకా డివిఎస్ సంచలన పెద్దన్న, వల్లూర్ నాగేష్, జివికె మూర్తి, కన్నమేడి కృష్ణమూర్తి, లింగన్న, ధనంజయ,నాగరాజు, మల్లిల్లి , అశ్వత్థప్ప గంగాధర నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డ్రోన్ సాయంతో... అడవిలోకి విత్తన బంతులు.



**తలపుల ఆగస్టు 13 సీమ వార్త సాయంత్రం.** తలుపుల మండలం ఉదుమలకుర్తి గ్రామ పరిధిలో చిన్నపల్లి గ్రామంలో సి ఎస్ ఏ సంస్థ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మరియు ఆర్డబ్ల్యాఖ ప్రాజెక్టు ద్వారా స్టేట్ కోఆర్డినేటర్ ఆదినారాయణ మరియు ఉమామహేశ్వరరావు శ్యామల గిరిధర్ తలపుల బీట్ మరియు దొరిగల్లు ఈస్ట్ బీట్ పరిధిలోగల గొరివికనుమ రిజర్వ్ అడవి నందు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ను ఉపయోగించుకొని డ్రోన్ సహాయం తో విత్తన బంతులను అడవిలో ఖాళీ ప్రదేశాలలో చింత,రావి, సీతాఫలం, ఉసిరి , రేల వంటి వివిధ జాతుల విత్తన బంతులను చల్లడం జరిగింది.దీని ఫలితంగా రాబోయే వర్షాలకు వర్షం విత్తన బంతుల పై పడి మొలకలు వచ్చి సహజ సిద్ధంగా చెట్లు పెరుగుతాయని, తద్వారా అటవీ విస్తీర్ణం పెరిగి జీవ వైవిధ్యం పరిరక్షణకు తోడ్పడుతుందని, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలని అడవుల సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, విత్తన బంతుల ద్వారా గొరివికనుమ రిజర్వ్ నందు పచ్చదనం పెరుగుతుందని అటవీశాఖ అధికారులు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఖ.ప్రదీప్ తేజ మరియు దీ.నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు కెవి రమణ గారు, మెహతా గారు గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడలకు మైలురాయి.... ఆర్డిటి స్టేడియం.

-మొదటిపేజీ తరువాయి



మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. క్రీడలు యువతలో క్రమశిక్షణను, పట్టుదలను పెంపొందిస్తాయని, ఈ స్టేడియం ద్వారా స్థానిక క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు చక్కటి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి తోడ్పడతాయని, యువత దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే ఎం. రాజు, ఎమ్మెల్సీ గుండుమాల తిప్పేస్వామి మాట్లాడుతూలి నియోజకవర్గంలో క్రీడారంగ అభివృద్ధికి ఆర్డీటీ సంస్థ అందిస్తున్న సహకారం మరచిపోలేనిదని, ఈ ప్రాంత అభివృద్ధికి సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు.ఆర్డీటీ ప్రతినిధి మంచో ఫెరార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రతిభను వెలికితీసి వారికి సరైన శిక్షణ, వసతులు కల్పించడమే తమ సంస్థ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్డీటీ సిబ్బంది, క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## మందు బాబులకు దడ పుట్టిస్తున్న రూరల్ పోలీసులు

**డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికితే 10,000 కట్టాల్సిందే - 9 కేసులకు 90 వేలు జరిమానా**

**ప్రమాదాల నివారణకే కఠిన చర్యలు - సిఐ నారాయణరెడ్డి**



**తాడిపత్రి, ఆగస్టు 13 సీమ వార్త సాయంత్రం:** రోడ్డు ప్రమాదాల నివారణకు తాడిపత్రి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెలలో విస్తృత తనిఖీలు చేపట్టారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్ పై కొరడా**

పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 9 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. వారిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా కోర్టు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున మొత్తం రూ.90,000 జరిమానా విధించింది.

**150 ఓపెన్ డ్రింకింగ్ కేసులు**

అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 150 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు వారికి జరిమానాలు విధించారు.

**750 వాహనాలకు ఫైన్**

వాహన తనిఖీల్లో రికార్డులు, ధ్రువపత్రాలు సక్రమంగా లేని 750 మంది వాహన యజమానులపై చట్టప్రకారం జరిమానాలు విధించారు.

**ప్రమాదాల నివారణకే కఠిన చర్యలు: సిఐ నారాయణరెడ్డి**

ఈ సందర్భంగా తాడిపత్రి రూరల్ సిఐ నారాయణరెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉన్నందున భవిష్యత్తులో కూడా విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు వాహన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడే వారిపై కఠిన చర్యలు తీసుకుని కోర్టులో హాజరుపరుస్తామని, పునరావృతంగా నిబంధనలు ఉల్లంఘించే వారిపై మరింత కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపకుండా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా, వాహనాల రికార్డులు సక్రమంగా ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

## జాతీయ వినియోగదారుల సదస్సుకు..... జేసీని ఆహ్వానించిన వినియోగదారుల సంఘాల సమాఖ్య



**పుట్టపర్తి, ఆగస్టు 13: సీమ వార్త సాయంత్రం.** సెప్టెంబర్ 12, 13 తేదీల్లో పుట్టపర్తిలో నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల సదస్సుకు శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ మౌర్య భరద్వాజ్, ఐఏఎస్ ని ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆహ్వానించినట్లు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఐఏఎస్ గారిని కలిసి, సెప్టెంబర్ 12, 13 తేదీల్లో రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య మరియు జాతీయ వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు.అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీ వంశీకృష్ణారెడ్డి గారిని కూడా సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ, శ్రీ సత్యసాయి జిల్లాలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి వినియోగదారుల సదస్సుకు శాఖ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా క్యాప్కో చైర్మన్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, జాతీయ వినియోగదారుల సదస్సు ద్వారా వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, నాణ్యత ప్రమాణాలు, వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై దేశవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకానున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ అన్నదాత రామిరెడ్డి, జుర్రాజూ సభ్యులు చిన్న తంబి చిన్నప్ప, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పళ్లెం జనార్ధన్, ధర్మవరం మండల జనరల్ సెక్రటరీ గుర్రం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు యజ్జన్న, బుక్కపట్నం మండల అధ్యక్షులు ఎం. లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ మహమ్మద్ రఫీ, సభ్యులు ఆవుల విష్ణు, యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## శంకర పార్థివదేహానికి...చరణ్ రెడ్డి నివాళులు.

**....పాల్గొన్న....మండల వైసీపీ నాయకులు.**



**గోరంట్ల ఆగస్టు 13 సీమ వార్త సాయంత్రం.** ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెనుకొండ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు బోయ శ్రీనివాసులు సోదరుడు బోయ శంకర మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు, శ్రీ సత్యసాయి జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ భర్త శ్రీ చరణ్ రెడ్డి వారి స్వగృహానికి వెళ్లి శంకర గారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొని శంకర గారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల వైసీపీ కన్వీనర్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు రఘురామిరెడ్డి, బూతులు శ్రీనివాస్ రెడ్డి, నార్సింపల్లి హరినాథ్ రెడ్డి లతోపాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881